క్లుప్తంగా

రంగా జయంతి వేడుకకు ఆహ్వానం



పామర్రు: దివంగత ఎమ్మెల్యే వంగవీటి మోహనరంగా ఆశయ సాధనకు పార్టీలకతీతంగా ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని విజయవాడ రాధా రంగా మిత్ర మండలి కన్వీనర్ ఆకుల శ్రీనివాస్ కుమార్ అన్నారు. పామర్రు నియోజకవర్గ శాసన సభ్యుడు కైలే అనిల్‌కుమార్ నివాసంలో శ్రీనివాస్ కుమార్ ఎమ్మెల్యేతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ.. ఉమ్మడి తెలుగు రాష్ట్రాల ప్రజలందరి ఆరాధ్య దైవంగా భావించే గొప్ప వ్యక్తి వీఎంఆర్ అని అన్నారు. జూలై 4వ తేదీన విజయవాడ తుమ్మలపల్లి క్షేత్రయ్య కళా క్షేత్రంలో రంగా అభిమాన సంఘాల ఆధ్వర్యంలో జరిగే రంగా జయంతి కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. నియోజకవర్గం నుంచి రంగా అభిమానులతో పెద్ద సంఖ్యలో హాజరు కావాలని ఎమ్మెల్యేను కోరామని చెప్పారు. అనంతరం రంగా జయంతి కార్యక్రమానికి సంబంధించిన ఆహ్వాన పత్రికను ఎమ్మెల్యేకు అందించామన్నారు. ఈ విషయమై ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు, వంగవీటి అభిమానులు పాల్గొన్నారు.

2న వేణుగోపాలుని కల్యాణోత్సవం

ముదినేపల్లిరూరల్: రెండో పూరిగా ప్రసిద్ధి చెందిన మండలంలోని వడాలి శ్రీజగన్నాథస్వామి ఆలయంలో వచ్చే నెల 2వ తేదీన శ్రీరుక్మిణీ, సత్యభామ సమేత వేణుగోపాలస్వామి వారి శాంతి కల్యాణోత్సవం నిర్వహిస్తామని ఆలయ ఈవో శింగనపల్లి శ్రీనివాసరావు గురువారం చెప్పారు. ఆషాఢ మాసం సందర్భంగా ప్రతి ఏటా ఆనవాయితీగా ఈ కల్యాణాన్ని జరుపుతున్నామన్నారు. కల్యాణోత్సవంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొనాలని కోరారు.

అగ్నిప్రమాద బాధితునికి సాయం అందజేత



ముదినేపల్లిరూరల్: స్థానిక మూడో బజారులో విద్యుత్‌షార్టు సర్క్యూట్ కారణంగా మంగళవారం అర్ధరాత్రి జరిగిన అగ్నిప్రమాదంలో సర్వస్వం కోల్పోయిన బాధిత కుటుంబాన్ని సర్పంచ్ నిమ్మగడ్డ కైకమ్మ, వైఎస్సార్ సీపీ నాయకులు గురువారం పరామర్శించి, ఆర్థికసాయం అందించారు. ఈ ప్రమాదంలో రూ.3 లక్షల ఆస్తినష్టం వాటిల్లినట్లు బాధితుడు ఉప్పల కోదండరామయ్య తెలిపారు. సమాచారం తెలుసుకున్న జెడ్పీటీసీ సభ్యురాలు ఈడే వెంకటేశ్వరమ్మ, వెంకటేశ్వరరావు, సర్పంచ్ నిమ్మగడ్డ కైకమ్మ, భిక్షాలు దంపతులు బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ.7 వేల నగదు, నిత్యావసర సరుకులు అందజేశారు. నాయకులు ఈడే ఉమ, శ్రీనివాసరావు, పళ్లెం పుణ్యేశ్వరరావు, జన్ను రాంబాబు పాల్గొన్నారు.

హోండా షైన్ 100 సీసీ బైక్ విడుదల



గుడివాడటౌన్: ప్రస్తుత మార్కెట్‌లో వేగం, నాణ్యత, ఇంధన పొదుపు ఉన్న వాహనాలపై ప్రజలు మొగ్గు చూపుతున్నారని పృథ్వీ మోటార్స్ జనరల్ మేనేజర్(సేల్స్) శరద్ ఉండ్రే అన్నారు. స్థానిక పామర్రు రోడ్డులోని పృథ్వీ మోటార్ సైకిల్స్ షోరూమ్‌లో నూతనంగా ప్రవేశపెట్టిన హోండా షైన్ 100 సీసీ బైక్‌ను ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినియోగదారులకు అందుబాటులో ఉండే ధర, నాణ్యతా ప్రమాణాలు అత్యంత ఆధునీకరణలతో ఈ నూతన వాహనం డిజైన్ చేశారన్నారు. ఈ వాహనానికి 10 ఏళ్ల వారంటీ ఇస్తున్నామన్నారు. కార్యక్రమంలో జోనల్ మేనేజర్(సర్వీస్) రాహుల్ కుమార్, ఏరియా సేల్స్ మేనేజర్ మంజునాథ్ పాటిల్, ఏరియా మేనేజర్(సర్వీస్) హర్షారెడ్డి, హోండా బిజినెస్ సపోర్టర్ నరేంద్ర పూనియా, షోరూమ్ చైర్మన్ ఎం.రమేష్‌బాబు, సిబ్బంది పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో బక్రీద్ వేడుకలు

- మసీదులు, ఈద్గాల్లో ప్రత్యేక ప్రార్థనలు
- పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్న ముస్లింలు
- త్యాగ నిరతికి నిదర్శనం బక్రీద్



కైకలూరులో ఈద్గాకు వస్తున్న ఎమ్మెల్యే డీఎన్నార్, ముస్లింలు



గుడివాడ ప్రార్థనల్లో పాల్గొన్న ముస్లింలు

గుడివాడటౌన్: గుడివాడ, పామర్రు, కైకలూరు నియోజకవర్గాల్లో బక్రీద్ పర్వదిన వేడుకలను గురువారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్థానిక బంటుమిల్లి రోడ్డులోని మియాఖాన్ మసీదు, షాహీ మజీద్, బిలాల్ మసీదు, గంగానమ్మ వీధిలోని గుల్జార్‌చౌక్ మసీదు, పాత బైపాస్ రోడ్డులోని జామ్యా మసీదు, వలివర్తిపాడు రోడ్‌లోని ఏక్ మినార్ మసీదు, డ్రైవర్స్ కాలనీలోని మర్కజ్ మసీదు, నిజాంపేటలోని చిన్న మసీదు, కార్మికనగర్‌లోని మసీదుల్లో ముస్లిం సోదరులు ఉదయాన్నే ప్రత్యేక ప్రార్థనలు జరుపుకున్నారు. పరస్పరం శుభాకాంక్షలు తెలుపుకుని ఉత్సాహంగా పండుగ జరుపుకున్నారు.

కైకలూరు: పవిత్ర ఈదుల్ అజ్‌హా(బక్రీద్) పర్వదినాన్ని ముస్లింలు వైభవంగా నిర్వహించారు. కైకలూరు పెద్ద, చిన్న మసీదులు, కలిదిండిలో నాలుగు మసీదుల్లో ముస్లింలు ఈద్గా వద్ద ప్రత్యేక ప్రార్థనలు జరిపారు. కైకలూరులో ముస్లింలతో కలిసి ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్) ర్యాలీగా నడుచుకుంటూ ఈద్గాకు చేరుకున్నారు. ముస్లింలను ఆలింగనం చేసుకుని శుభాకాంక్షలు తెలిపారు. ఇరు మండలాల్లో మత గురువులు ముఫ్తీ ఇలాహుల్ హక్, ఎండీ. వసీం, రజావుల్లాలుదె ప్రవక్త ఇబ్రహీం మహోన్నత త్యాగాన్ని అందరికీ వివరించారు. ప్రేమ, త్యాగం, కరుణ గుణాలను అందరూ కలిగి ఉండాలని సూచించారు. సామూహిక ప్రార్థనలు చేశారు. అనంతరం పేదలకు దానాలు చేశారు. కార్యక్రమాల్లో మసీదుల పెద్దలు అబ్దుల్ హమీద్, జిలానీ బాషా, మహమ్మద్ జహీర్, ఏలూరు జిల్లా వక్ఫ్‌బోర్డు డైరెక్టర్లు చాన్ బాషా, రహంతుల్లా, అస్లాం, హమీద్, ఎండీ ఆసీఫ్‌పాషా, ఉస్మాన్, ఖరీం, ఎండీ ఖాసీం, ముషా, వసీం, రఫిబాషా, గాలిబ్‌బాబు, అబీవుల్లాఖాన్, ఎండీ. వదూద్, పెద్ద సంఖ్యలో ముస్లింలు పాల్గొన్నారు. ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ ముస్లింలకు బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు.

మండవల్లిలో..

మండవల్లి: మండలంలోని పలు గ్రామాల్లో బక్రీదు పర్వదినాన్ని ఘనంగా నిర్వహించారు. మండలంలోని ఉనికిలి, సింగనపూడి, అల్లినగరం, గొల్లగూడెం గ్రామాల్లో బక్రీదు పండుగను జరుపుకున్నారు. బాషా, షేక్ సైదాసాహెబ్, షేక్ బాజీ, షేక్ నాగూల్ తదితరులు బక్రీదు వేడుకల్లో పాల్గొన్నారు.

పామర్రులో వేడుకలు

పామర్రు: త్యాగం, సహనం ఐకమత్యానికి ప్రతీక బక్రీద్ అని దైవ ప్రవక్త ఇబ్రహీం త్యాగాన్ని స్మరించుకుంటూ బక్రీద్ పండుగను జరుపుకోవడం జరుగుతోందని పామర్రు మసీద్ ఖాజీ అబ్దుల్ రెహమాన్ యూనుస్ అన్నారు. స్థానిక పెద్ద మసీద్ వద్ద బక్రీద్ సందర్భంగా గురువారం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పండుగ వేళ నిరుపేదలను ఆదుకోవాలన్నారు. పేదలైన ముస్లిం సోదరులకు శుభాకాంక్షలను తెలుపడమే కాకుండా వారికి తమ ఆహారంలో కొంతభాగాన్ని ఇవ్వాలని అన్నారు. ఎవ్వరైతే పేదలను సహృదయంతో ఆదుకుంటారో వారే నిజమైన అల్లా భక్తులు అని అన్నారు. అల్లా చూపిన మార్గంలో ప్రతీ ఒక్కరు పయనించాలని, ప్రతీ నిత్యం మనం ధర్మయుతమైన మార్గంలో నడవాలని సూచించారు. తనకు ఉన్నంతలో పేదలకు సహాయం చేయాలని కోరారు. పండుగ రోజున దానాలు, ధర్మాలను నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో ఎండీ జమీల్, ముస్లింలు పాల్గొన్నారు.

మొవ్వ మండలంలో..

మొవ్వ: మొవ్వ మండలంలో బక్రీద్ వేడుకలను ముస్లింలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మండల పరిధిలోని పెదపూడి, భట్లపెనుమర్రు, మొవ్వ, కోసూరుచ నిడుమోలు, కాజ గ్రామాల్లోని మసీదుల్లో ప్రత్యేక నమాజ్‌లు చేశారు. ఈ సందర్భంగా ఇమామ్‌లు త్యాగాలకు ప్రతీకగా నిలిచిన బక్రీద్ విశిష్టతను భక్తులకు వివరించారు. అనంతరం సంప్రదాయ రీతిలో పండగ వేడుకలను నిర్వహించుకున్నారు.

పమిడిముక్కలలో..

పమిడిముక్కల: మండలంలోని అలీనఖీపాలెం గ్రామంలో ముస్లింలు బక్రీద్ పండుగను గురువారం ఘనంగా జరుపుకొన్నారు. గధీర్ సొసైటీలో మతగురువు మౌలానా షమీముల్ హసన్ నాజఫి ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. త్యాగం, సహనం, ఐకమత్యానికి ప్రతీక బక్రీద్ అని మతగురువు పేర్కొన్నారు. ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ ముస్లింలకు బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్ష, కార్యదర్శులు హుస్సేన్ అలీ, సాజాద్ అలీ, కో-ఆప్షన్ సభ్యులు మీర్జా దియానత్ అలీ, వైస్ చైర్మన్ షా జవాద్ అలీ పాల్గొన్నారు.

పెదపారుపూడి మండలంలో..

వెంట్రప్రగడ(పెదపారుపూడి): మండలంలోని వెంట్రప్రగడ, కొర్నిపాడు గ్రామాల్లో ముస్లింలు బక్రీద్ పండుగాను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. వెంట్రప్రగడ మసీద్‌లో ఉదయం నుంచే ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం ఒక్కరికి ఒక్కరు శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు, పేదలకు డబ్బులు, స్వీట్స్ పంచి పెట్టారు.



పామర్రు మసీదులో ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న ఖాజీ అబ్దుల్ రెహమాన్ యూనుస్



పెదపూడిలో నమాజ్ చేస్తున్న ముస్లింలు



అలీనఖీపాలెంలో ప్రార్థనల్లో పాల్గొన్న ముస్లింలు

ముస్లింలకు శుభాకాంక్షలు




ఎమ్మెల్యే కొడాలి నానిని కలిసిన ముస్లింలు

గుడివాడటౌన్: బక్రీద్ పర్వదినాన్ని పురస్కరించుకుని ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు(నాని) పండుగ శుభాకాంక్షలు తెలిపారు. వైఎస్సార్ సీపీ మైనార్టీ సెల్ పట్టణ ఉపాధ్యక్షుడు అలీబేగ్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యేను గురువారం ఆయన నివాసంలో మైనార్టీ సెల్ యూత్ సభ్యులు కలిసి ముస్లిం సాంప్రదాయాలతో కండువా కప్పి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కొడాలి నాని మాట్లాడుతూ బక్రీద్ పర్వదినం యొక్క త్యాగం, విశ్వాసం ముస్లిం సోదరులు అలవర్చుకుని భక్తిశ్రద్ధలతో పండుగ జరుపుకోవాలని ఆకాంక్షించారు.

వైభవంగా తొలి ఏకాదశి పూజలు



సర్వాలంకారంలో రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి



శాకంబరి దేవిగా బాలమ్మ తల్లి



పామర్రు విష్ణాలయంలో గీతా పారాయణం చేస్తున్న భక్తులు

పామర్రు: పామర్రు, గుడివాడ, కైకలూరు నియోజకవర్గాల పరిధిలో తొలి ఏకాదశి వేడుకలను గురువారం వైభవంగా నిర్వహించారు. పామర్రులో పలు వైష్ణవ ఆలయాల్లో విశేష పూజలను చేపట్టారు. స్థానిక రుక్మిణీ సత్యభామా సమేత శ్రీ వేణుగోపాలస్వామి ఆలయంలో స్వామికి విశేషంగా పంచామృతాలతో అభిషేకాలను చేసి, విఘ్నేశ్వరపూజ, పుణ్యాహవచన, మండపారాధన, నవగ్రహ పూజ అనంతరం స్వామికి శత సహస్ర నామాలతో ప్రత్యేకంగా పూజలను చేశారు. ఆలయ ప్రాంగణంలో వేణుగోపాల గీతా పారాయణ భజన సమాజం సభ్యులచే భగవత్ గీత, విష్ణు, లలిత సహస్ర నామ పారాయణం చేశారు. ఆలయంలో విశేష పూజలను ఆలయ అర్చకుడు ఆర్కేబీ అప్పలాచార్యుల ఆధ్వర్యంలో నిర్వహించామని ఆలయ మేనేజర్ కె.వెంకటరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో భక్తులు రాజేశ్వరి, సుశీల, రాజ్యలక్ష్మి, సుభద్ర, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

రావర్లలో..

రావర్ల గ్రామంలో గణ్యశ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో తొలి ఏకాదశిని పురస్కరించుకుని విశేష పూజలను నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు. ఆలయ అర్చకుడు బి.పద్మాకర్, ఆలయ నిర్వాహకులు కాకర్ల బలరామమూర్తి, కె.శివశంకర్, బి.బాలాకుమారి పర్యవేక్షించారు.

శాకంబరి దేవీగా బాలమ్మ దర్శనం

కూచిపూడి(మొవ్వ): మొవ్వ మండలంలోని పలు గ్రామాల్లో తొలి ఏకాదశి వేడుకలను భక్తులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఇందులో భాగంగా కూచిపూడిలోని నాట్యాచార్యుల ఇలవేలుపైన శ్రీ బాలా త్రిపుర సుందరీ అమ్మవారు శాకంబరి దేవీగా భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా దేవాలయం వేకువ జాము నుంచే భక్తులతో కళకళలాడుతూ సందడిగా మారింది. ఆలయ అర్చకుడు పెనుమూడి పూర్ణచంద్ర శేఖర శర్మ ఆధ్వర్యంలో కూచిపూడి వాసవీ క్లబ్ అధ్యక్షురాలు వలివేటి లక్ష్మీ బృందం అమ్మవారిని శాకాంబరీ దేవిగా అలంకరించారు.

ముదినేపల్లిలో పూజలు

ముదినేపల్లిరూరల్: మండలంలోని పలు ఆలయాల్లో తొలిఏకాదశి పూజలు గురువారం ఘనంగా జరిగాయి. వేకువజామునే భక్తులు ఆలయాలకు చేరుకుని పూజలు చేశారు. సింగరాయపాలెం లక్ష్మీ నృశింహ స్వామి ఆలయంలో ఈవో శింగనపల్లి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో స్వామివారికి అభిషేకాలు, ప్రత్యేక పూజలను ఆలయ అర్చకులు నిర్వహించారు. పూజా కార్యక్రమాల్లో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. వడాలి శ్రీజగన్నాథస్వామి, చేవూరు లక్ష్మీనారాయణ స్వామి, ఊటుకూరు శ్రీప్రసన్న వెంకటేశ్వరస్వామి, ప్రొద్దువాక శ్రీకల్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయాల్లో తొలిఏకాదశి పూజలు నిర్వహించారు.

'మన కోసం - మన సభ'ను విజయవంతం చేయాలి



బహిరంగ సభ, విగ్రహావిష్కరణ వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న యాదవ సంఘ నాయకులు

పామర్రు: యాదవుల సమస్యల పరిష్కారానికి అందరూ సంఘటితం కావాలని యాదవ సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొడ్డు రమేష్‌యాదవ్ పిలుపునిచ్చారు. జూలై నెల 9వ తేదీన జరిగే ములాయంసింగ్ యాదవ్ విగ్రహావిష్కరణ, బహిరంగ సభలకు సంబంధించిన మన కోసం మన సభ వాల్ పోస్టర్‌ను స్థానిక శివరామ సినీ కాంప్లెక్స్‌లో గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యాదవుల అభ్యున్నతికి ములాయసింగ్ చేసిన సేవలు అభినందనీయమన్నారు. వచ్చే నెల 7వ తేదీన రాజా టోల్ ప్లాజా వద్ద గుంటూరు-విజయవాడ రహదారిలో మధ్యాహ్నం 3 గంటలకు ములాయం సింగ్ యాదవ్ విగ్రహావిష్కరణ జరుగుతుందన్నారు. అనంతరం నాగార్జున యూనివర్సిటీ ఎదురు గ్రౌండ్స్‌లో సాయంత్రం 4 గంటలకు బహిరంగ సభ జరుగుతుందని చెప్పారు. ఈ విగ్రహావిష్కరణ కార్యక్రమంలో సమాజ్ వాది పార్టీ జాతీయ అధ్యక్షుడు అఖిలేశ్ యాదవ్ ముఖ్య అతిథిగా పాల్గొని విగ్రహాన్ని ఆవిష్కరిస్తారని తెలిపారు. కార్యక్రమానికి యాదవ సంఘ సభ్యులు అందరూ తప్పనిసరిగా హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘ రాజకీయ వ్యవహారాల అధ్యక్షుడు గొరిపర్తి శ్రీనివాస్, నియోజకవర్గ సంఘ అధ్యక్షుడు నాగనిబోయిన సునీల్ యాదవ్, పామర్రు వైస్ ఎంపీపీ ఆరేపల్లి శ్రీనివాసరావు, యాదవ సంఘ నాయకులు కూసం పెద వెంకటరెడ్డి, కొలుసు కోటేశ్వరరావు, గొరిపర్తి నాగబాబు, పుట్టి కిషోర్‌బాబు, ఎన్‌వీ నాంచారయ్య, కె.నాగరాజు, కె.గోవింద్, ఏ.నాగేష్, మద్ది రామయ్య, కె.నాగేశ్వరరావు, కెవీ బాబు పాల్గొన్నారు.

రేపు డాక్టర్స్ డే వేడుకలు

పామర్రు: స్థానిక తమ్మా వినోద్‌రెడ్డి శృతి వైద్యశాలలో శనివారం మధ్యాహ్నం డాక్టర్స్ డే వేడుకలు నిర్వహిస్తున్నట్లు కళా పీఠం అధ్యక్షుడు కాటూరి వెంకట మురళీ కృష్ణ గురువారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ.. మండల పరిధిలోని నిష్ణాతులైన 10 మంది వైద్యులను సన్మానిస్తామన్నారు. కార్యక్రమంలో కళా పీఠం సభ్యులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

జేసీఎస్ ఇన్‌చార్జీల నియామకం

పామర్రు: పామర్రు నియోజకవర్గంలోని ఐదు మండలాలకు జగనన్న సచివాలయ సారథు(జేసీఎస్)లను వైఎస్సార్ సీపీ కేంద్ర కార్యాలయం గురువారం ప్రకటించింది. పామర్రు మండల జేసీఎస్‌గా ముప్పిడి సురేష్‌రెడ్డి, మొవ్వ మండలానికి సమ్మెట ఆంజనేయులు, పమిడిముక్కల మండలానికి పరసా జగన్, పెదపారుపూడి మండలానికి జె.సుబ్రహ్మణ్యం(జాజుల చిన్నారి), తోట్లవల్లూరు మండలానికి నడకుదురు రాజేంద్రలను నియమించినట్లు ఆదేశాలు జారీ చేశారు.

గుడివాడ నియోజకవర్గానికి నియామకం

గుడివాడటౌన్: గుడివాడ నియోజకవర్గంలోని మండలాల్లో ఉన్న సచివాలయాలను పర్యవేక్షించేందుకు జగనన్న సచివాలయ సారథులను నియమించినట్లు వైఎస్సార్ సీపీ కేంద్ర కార్యాలయం గురువారం తెలిపింది. మండలాల వారీగా గుడివాడరూరల్ మండలానికి కారే జోసఫ్, గుడ్లవల్లేరు మండలానికి కొత్తూరు లక్ష్మీనారాయణ, నందివాడ మండలానికి దేశిరెడ్డి రామ్మోహనరెడ్డిలను నియమించారు. అదే విధంగా గుడివాడ పట్టణానికి సంబంధించి గుడివాడ క్లస్టర్ -1లోని 1, 2, 3, 5, 8, 9, 10, 12, 13, 15, 36 వార్డులకు అగస్తిరాజు కృష్ణమోహన్‌ను, క్లస్టర్ - 2లోని 18, 19, 21, 24, 25, 26, 28, 29, 30, 31, 35 వార్డులకు దుడ్డు వెంకటేశ్వరరావు(చిన్నా), క్లస్టర్ -3లోని 4, 6, 7, 11, 14, 16, 17, 20, 22, 23, 27, 32, 33, 34 వార్డులకు వీరిశెట్టి వెంకట నరసింహారావులను నియమించారు. వీరు సచివాలయాల పనితీరును సమీక్షించి ప్రభుత్వ పథకాలను ప్రజలకు సక్రమంగా అందేలా చూస్తారని పార్టీ వర్గాలు తెలిపాయి.

జగనన్న కాలనీల్లో మెరక పనులు



గుడివాడటౌన్(నందివాడ): నందివాడ మండలం లక్ష్మీనరసింహపురం గ్రామంలో ఏర్పాటు చేసిన జగనన్న కాలనీలో ప్లాట్‌లకు మెరక చేసేందుకు భారీగా మట్టిని తోలుతున్నారు. గ్రామానికి చెందిన ప్రభుత్వ చెరువులో మరమ్మతులతో పాటు భారీగా మట్టిని జగనన్న కాలనీ స్థలాలు మెరక చేసేందుకు తరలిస్తున్నారు. ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు(నాని) సూచనల మేరకు ఈ కార్యక్రమం కొనసాగిస్తుండగా ప్రతిపక్షాలు వైఎస్సార్ సీపీ నాయకులు మట్టి అమ్ముకుంటున్నారంటూ విమర్శలు చేయడం, ఎల్లో మీడియాలో కథనాలు ప్రచురించడం సరైన విధానం కాదని స్థానిక నాయకులు అంటున్నారు. మొత్తం 104 మంది లబ్ధిదారులకు చెందిన ఇళ్ల స్థలాలను రోడ్డు కన్నా రెండడుగుల ఎత్తు మెరక చేయడం, పెద్ద సంఖ్యలో ట్రాక్టర్‌లను వినియోగించి మెరక పనులు చేస్తున్న ప్రతిపక్షాలకు ఇది కనిపించడం లేదా అని వైఎస్సార్ సీపీ నాయకులు ప్రశ్నిస్తున్నారు. గతంలో మండలంలో ఒక్క లబ్ధిదారునికి కూడా ఒక సెంటు భూమిని కూడా ఇవ్వని టీడీపీ నాయకులు విమర్శలు చేయడం సరికాదన్నారు.

ముమ్మరంగా ఉపాధి హామీ పనులు



పనులు నిర్వహిస్తున్న కూలీలు

మండవల్లి: మండలంలోని 24 గ్రామాల్లో 32 పంట బోదెల అభివృద్ధి పనులను, రూ.9 లక్షల 62 వేల అంచనా విలువతో 2,360 మంది ఉపాధి కూలీలు గురువారం నిర్వహించినట్లు ఇన్‌చార్జి ఏపీవో నవీన్ పేర్కొన్నారు. పంట బోదెల అభివృద్ధి పనుల కారణంగా పొలాలు సస్యశ్యామలంగా మారి రైతులకు అధిక దిగుబడులు వస్తాయన్నారు. పంట బోదెలతో పాటుగా చెరువులు, పంట కాలువలు కూడా మరమ్మతులు చేసి పూర్తిస్థాయిలో వినియోగంలోకి తీసుకురావడం వల్ల, తాగునీరు, సాగునీటి, పశువులకు తాగునీటి సమస్యలు తీరుతున్నాయన్నారు. అయ్యవారిరుద్రవరంలో రూ.84 వేల 670 అంచనా విలువతో 76 మంది కూలీలతో పంటబోదె పనులు చేసినట్లు నవీన్ పేర్కొన్నారు. ఫీల్డ్ అసిస్టెంట్, మేట్‌లు, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

దాతల సేవలు అభినందనీయం



కైకలూరు: ప్రజలకు సేవ చేయడానికి ముందుకొస్తున్న దాతలు అభినందనీయులని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) అన్నారు. కైకలూరులో తల్లిదండ్రుల జ్ఞాపకార్థం వార్డు సభ్యుడు తోట మహేష్ తయారు చేయించిన మంచినీటి సరఫరా ట్యాంకు, బైపాస్ రోడ్డు నుంచి వైఎస్సార్ కాలనీ చేరడానికి నాగిరెడ్డి రమేష్ నిర్మించిన వంతెనను ఎమ్మెల్యే డీఎన్నార్ గురువారం ప్రారంభించారు. ప్రజల అవసరాల తీర్చడానికి ముందుకొస్తున్న దాతలను ఇతరులు ఆదర్శంగా తీసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ అడవి కృష్ణ, సర్పంచ్ దానం మేరీ నవరత్నకుమారి, ఏఎంసీ చైర్మన్ దండే పుష్పలత, వైస్ చైర్మన్ జంపన కొండరాజు, పీఏసీఎస్ అధ్యక్షుడు పంజా రామారావు, సమయం వీరాంజనేయులు, నిమ్మల సాయి, షేక్ రఫీ, పంజా నాగు, కూనవరపు సతీష్, దండే రవిప్రకాష్, పిచ్చుకల సుధారాణి, గడి నాగేశ్వరరావు, మదన్ పాల్గొన్నారు.

జగనన్న సురక్ష కార్యక్రమ షెడ్యూల్

ముదినేపల్లిరూరల్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన జగనన్న సురక్ష కార్యక్రమాల షెడ్యూల్‌ను ఎంపీడీవో పి.మల్లీశ్వరి గురువారం ఖరారు చేశారు. ఈ కార్యక్రమానికి సంబంధించి 11 అంశాలపై ఈనెల 24 నుంచి గ్రామ సచివాలయ వలంటీర్లు సర్వే ప్రారంభించారు. ఈ సర్వే అనంతరం రెండు టీమ్‌లతో మండలంలో సభల నిర్వహణకు సంబంధించి షెడ్యూల్ విడుదల చేశారు. ఎంపీడీవో మల్లీశ్వరితో పాటు డెప్యూటీ తహసీల్దార్ పి.మరియన్న, ఎంపీడీవో కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ ప్రకాశరావుతో ఒక టీమ్, తహసీల్దార్ కె.శ్రీనివాస్, ఈవోపీఆర్డీ టీవీ సారథి, ఆర్ఐ పి.శివకుమార్‌తో మరో టీమ్ మండలంలో పర్యటిస్తాయి. ఎంపీడీవో ఆధ్వర్యంలో వచ్చే నెల 3న పెదపాలపర్రు, 5న కోడూరు, 7న పెనుమల్లి, 10న పేరూరు, 12న చిగురుకోట, 14న ముదినేపల్లి-2, 17న ముదినేపల్లి-1, 19న గురజ, 21న పెయ్యేరు, 24న వడాలి, 26న సింగరాయపాలెం సచివాలయాల్లో సమావేశాలు నిర్వహిస్తారన్నారు. అదేవిధంగా తహసీల్దార్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో 1న పెదగొన్నూరు, 6న బొమ్మినంపాడు, 11న దేవపూడి, 13న వణుదుర్రు, 15న వాడవల్లి, 18న ఊటుకూరు, 20న శ్రీహరిపురం, 22న వైవాక, 25న కొరగుంటపాలెం సచివాలయాల పరిధిలో సమావేశాలు నిర్వహించి ప్రభుత్వ పథకాలకు సంబంధించిన 11 రకాల ప్రజా సమస్యలు పరిష్కరిస్తారని చెప్పారు.

మండలాభివృద్ధికి కృషి చేయాలి



పెదపారుపూడి: మండలాభివృద్ధికి అధికారులు చిత్తశుద్ధితో కృషి చేయాలని ఎంపీపీ గోగం సురేష్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం సాయంత్రం ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. స్థానిక సమస్యలను సమావేశం దృష్టికి తీసుకురావడంతో వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఎంపీపీ అధికారులను ఆదేశించారు. జల జీవన్ మిషన్ ద్వారా అన్ని గ్రామాల్లో తాగునీటి కనెక్షన్ల ఏర్పాటుపై ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ హెహనజీను అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ పేద ప్రజల కోసం అందించిన సంక్షేమ పథకాలను ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో టి.సీతామహాలక్ష్మి, వైస్ ఎంపీపీ పొనుగుమాటి రజిని, ఎంపీటీసీలు చిగురుపాటి శ్రీధర్, చదలవాడ పద్మజ, జాజుల శ్రీనివాసరావు, సర్పంచ్‌లు, అధికారులు పాల్గొన్నారు.